నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 18 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI




యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు

# నేటి నుంచి నామినేషన్ల పర్వం

- యాదాద్రి కలెక్టరేట్‌లో ఆర్వో కార్యాలయం
- ఈ నెల 25 వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ
- 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు అవకాశం
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- 22న బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ నామినేషన్



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా, నాలుగో విడుత ఎలక్షన్‌లో భాగంగా గురువారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఇదే రోజు నుంచి నామినేషన్ల పర్వం షురూ కానుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ పత్రాల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. వచ్చే నెల 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది. జూన్ 6న ఎన్నికల కోడ్ పూర్తి కానుంది.

### నామినేషన్ల స్వీకరణ ఇలా..

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో జనగాం, ఆలేరు, తుంగతుర్తి, భువనగిరి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం ఉన్నాయి. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఆర్వో కార్యాలయాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వారు యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాలు మినహా అన్ని రోజుల్లో పత్రాలను స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ వేయొచ్చు. గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థి అయితే ఆయనతోపాటు ఒకరు ప్రతిపాదిత వ్యక్తి ఉండాలి. ప్రతిపాదిత వ్యక్తి భువనగిరి పార్లమెంట్ పరిధిలోని వ్యక్తిగా ఉండాలి. ఇతరులైతే 10మంది ప్రతిపాదితులతో నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఫామ్-26లో అన్ని వివరాలతో నామినేషన్ వేయాలి. అందులో విద్యార్హతలు, కేసులు, క్రిమినల్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి 25వేల సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అందులో సగం డబ్బులు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. ఎన్నికల ఖర్చు నిర్వహణ కోసం ఏదేని జాతీయ బ్యాంక్‌లో ఖాతా తెరువాలి. నామినేషన్ల సందర్భంగా 100 మీటర్ల దూరంలో ఇతరులను అనుమతించరు. అభ్యర్థితోపాటు మరో నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇక నామినేషన్లు సమర్పించాలనుకునే వారికి ఆర్వో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. సందేహాలు, సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆర్వో ఆఫీసు ప్రాంగణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

### 22న క్యామ మల్లేశ్ నామినేషన్..

నామినేషన్ల కోసం అభ్యర్థులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం అభ్యర్థికి బీఫామ్ అందించనున్నారు. ఈ నెల 22న క్యామ మల్లేశ్ భువనగిరి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. పెద్ద ఎత్తున నామినేషన్ వేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

### ప్రత్యేక బృందాల నియామకం

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. 22 స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీమ్‌లు, 13 వీడియో సర్వైలెన్స్, 23 వీడియో వ్యూయింగ్, 23 ఫ్లయింగ్ స్క్వాడ్, 58 ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) టీమ్‌లు, 245 సెక్టోరియల్ అధికారులను నియమించారు. వీరే కాకుండా పోలీస్ బలగాలను సిద్ధంగా ఉంచారు. జిల్లా పోలీస్‌లతోపాటు మరో మూడు ట్రూప్‌లు రెడీగా ఉన్నాయి. మరో మూడు ట్రూప్‌లు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

### నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్ : భువనగిరి పార్లమెంట్ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తామని, నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే తెలిపారు. కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 21న ప్రభుత్వ సెలవు సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ఉండదని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టామని, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ఎంసీఎంసీ కమిటీ ద్వారా ముందస్తు మీడియా అనుమతులు పొందాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణలో స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఉంచుతారని, ఎన్నికలకు సంబంధం లేని వాటిని గ్రీవెన్స్ కమిటీ ద్వారా తిరిగి ఇస్తారని చెప్పారు. ఇప్పటివరకు భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు సంబంధించి రూ.70.32 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్ అనుమతులు పొందాలని, ఆఫ్ లైన్ అనుమతులు అయితే సహాయ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సంతకంతో దరఖాస్తులు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.


యాదాద్రి ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## రమణీయం రాములోరి కల్యాణం

శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాలతోపాటు పలుచోట్ల సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తరించారు. వేద మంత్రాలు, భక్తిపాటలతో ఆధ్యాత్మిక సందడి కనిపించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.


వలిగొండలో పాల్గొన్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

## దంచికొడుతున్న ఎండలు

- యాదగిరిగుట్టలో అత్యధికంగా 44.6 డిగ్రీలు
- ఇండ్లకే పరిమితమవుతున్న జనం


భూదాన్‌పోచంపల్లి మండలం రేవనపల్లి గ్రామ శివారులో ఎండ వేడిమికి తాళలేక పారుతున్న కాల్వలో ఈదుతున్న బాతులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 17 : ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. జిల్లాలో బుధవారం 44.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని యాదగిరిగుట్టలో గరిష్ఠంగా 44.6 డిగ్రీలు, వలిగొండలో 43.4, ఆలేరు గొలనుకొండలో 43.3, బొమ్మలరామారం మర్యాలలో 43.2, మోత్కూరు బుజిలాపురంలో 42.8, చౌటుప్పల్‌లో 42.8, ఆత్మకూరు(ఎం)లో 42.7, రామన్నపేటలో 42.6, సంస్థాన్ నారాయణపురంలో42.3, భువనగిరి నందనంలో 42.2, భూదాన్‌పోచంపల్లి జలాల్‌పూర్‌లో 41.8 , బొమ్మలరామారం, గుండాల, మోటకొండూరు మండలాల్లో 41.7, రాజాపేట పాముకుంటలో 41.4, బీబీనగర్ వెంకిర్యాలలో 41 డిగ్రీలు, తుర్కపల్లి (ఎం)లో 39.4 డిగ్రీలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెరుగుతున్న ఎండ తీవ్రతలను తట్టుకోలేక ప్రజలు బయటికి వెళ్లడానికి భయపడుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్‌లో సమరోత్సాహం

- ఎన్నికలకు పూర్తి స్థాయితో సన్నద్ధత
- అవకాశవాదులు పార్టీని వీడడమే మంచిదంటున్న క్యాడర్
- మరింత పట్టుదలతో క్షేత్రస్థాయి శ్రేణులు
- సన్నాహక సమావేశాల్లో కొట్టొచ్చిన ఆత్మవిశ్వాసం
- పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యమని ప్రతిజ్ఞలు
- నేడు కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫామ్‌లు



నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్17(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో అటు నల్లగొండ, ఇటు భువనగిరి నియోజకవర్గాల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పార్టీ క్యాడర్‌తో సన్నాహక సమావేశాలు పూర్తి చేసి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలుకానుండడంతో ప్రచారాన్ని కూడా విస్తృతం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రకటించిన పార్టీ అభ్యర్థులు క్యామ మల్లేశ్‌యాదవ్, కంచర్ల కృష్ణారెడ్డికి గురువారం పార్టీ అధినేత కేసీఆర్ తెలంగాణ భవన్‌లో బీఫామ్‌లు అందించనున్నారు. ఇదే సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎజెండా, ప్రచార సరళి తదితర అంశాలపై పార్టీ ముఖ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లకు మరోసారి తావివ్వకుండా లోక్‌సభ ఎన్నికలపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. అందుకు అనుగుణంగా ఇప్పటికే భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో ఆయా నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల వారీగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు కూడా పూర్తి చేసింది. ఈ సమావేశాలకు పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. అక్కడక్కడ కొందరు అవకాశవాద నేతలు పార్టీని వీడుతున్నా సమావేశాల సందర్భంగా ఆ ప్రభావం ఎక్కడా కనిపించ లేదు. ఇంటి దొంగలు బయటకు వెళ్లిపోవడమే పార్టీకి మేలు చేస్తుందంటూ కార్యకర్తలు స్పష్టం చేశారు. అధికారం కోసం వచ్చిన నేతలు మళ్లా అధికారం కోసమే వెళ్లిపోయారని, వీరితో పార్టీకి వచ్చిన నష్టమేమీలేదని క్యాడర్ సమావేశాల్లో బహిరంగంగానే ప్రకటించారు. సమావేశాలకు హాజరైన పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో కనిపించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా పార్టీ చెక్కుచెదరలేదని, ప్రజల్లోనూ మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, కరువు, సాగు, తాగునీటి ఎద్దడి, రైతుబంధు నిలుపుదల, కరెంటు కోతలు తదితర అంశాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు భారీగా ఓట్లు పోలయ్యేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పలుచోట్ల ప్రతిజ్ఞలు సైతం చేయడం విశేషం. ఈ సమావేశాల్లో పార్టీ ముఖ్యుల ప్రసంగాలకు సైతం శ్రేణుల నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోగొట్టుకున్న ఓట్లను తిరిగి లోక్‌సభ ఎన్నికల్లో రాబట్టుకుంటామన్న ధీమా పార్టీ శ్రేణుల్లో వ్యక్తమైంది.

## మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై కేసు

- మిల్లుల ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసమే కారణం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయిస్తే ఆ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. అక్రమాల్లో భాగస్వామ్యమైన సూర్యాపేట జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్యతో పాటు కోదాడకు చెందిన నీలా సత్యనారాయణపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చివ్వెంల మండలం వల్లభాపురం వద్ద ఉన్న జగన్మాత పారాబాయిల్డ్ రైస్ మిల్లులో స్టాక్ సరిగా ఉండడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. సోమ నర్సయ్యకు చెందిన తిరుమలగిరి మండలంలోని సంతోష్ రైస్ మిల్లులో గత మూడు సీజన్‌లకు చెందిన రూ.90 కోట్ల విలువ చేసే 41,365 మెట్రిక్ టన్నుల ధాన్యం, కోదాడ మండలం కొమరబండ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీలో రూ.64 కోట్ల విలువ చేసే 29,093 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారని చెప్పారు. దాంతో సంతోష్ రైస్ మిల్లు యజమాని, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమనర్సయ్యతోపాటు శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీ యజమాని నీలా సత్యనారాయణపై అధికారుల ఫిర్యాదుల మేరకు 406, 409, 420, 120బి,109 ఐసీసీ సెక్షన్ ఆఫ్ ఈసీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో కొన్ని నాన్‌బెయిలబుల్ సెక్షన్లు ఉన్నాయన్నారు.

### తనిఖీలు చేసినా బయటకు రాని సమాచారం?

నాగారం మండలం ఈటూరు వద్ద ఉన్న రఘురామ పారాబాయిల్డ్ రైస్ మిల్లులో సైతం 15 నుంచి 20 మంది అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపటినట్లు సమాచారం. కానీ వాటిలో ఏమైనా అక్రమాలు జరిగాయా, ధాన్యం నిల్వలు ఉన్నాయా? అని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారితోపాటు ఇతర అధికారులను సంప్రదించినా తమకు తెలియదని చెప్పడం గమనార్హం.

# ఇంటి దారిన గురుకుల విద్యార్థులు

## ఆందోళనలో తల్లిదండ్రులు

- గురుకులాలు, హాస్టళ్లంటేనే జంకుతున్న వైనం
- జిల్లాలో ఇద్దరి ఆత్మహత్యలు మరుకముందే మరో విద్యార్థి మృతి
- యాజమాన్య నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వమే కారణమంటున్న తల్లిదండ్రులు
- భువనగిరి గురుకులంలో విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స
- ప్రశాంత్ మృతి కలిచివేసింది : ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు


భువనగిరి ఎస్సీ హాస్టల్ నుంచి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 17 : జిల్లాలోని భువనగిరి ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యలు మరువకముందే పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మరో విద్యార్థి మృతి చెందాడు. కేవలం బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, వసతి గృహాల్లోనే మృతి చెందుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందడంతోపాటు విద్యార్థులను అక్కడ ఉంచాలంటేనే జంకుతున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో అపరిశుభ్రంగా వంట గదులు, బోరు నీటి వాడకం, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు అందుబాటులో ఉండకపోవడం, వంటలను ఇష్టానుసారంగా చేస్తుండడం ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని తేటతెల్లమైంది. గతంలోనూ ప్రభుత్వ వసతి గృహాల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థుల ప్రాణాలు బలిగొన్నారు. మౌలిక వసతులు లేకపోవడం, విద్యార్థుల బాగోగులు సరిగా చూసుకోకపోవడం, సరైన భోజనం పెట్టకపోవడం, ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు లేక బయటి వ్యక్తులపై ఆధారపడడం, యాజమాన్యం బయటి వ్యక్తులకు అప్పగించడంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నైపుణ్యం లేని సిబ్బందితో వంటలు చేయించడంతో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కలుషిత ఆహారం కారణంగా బొమ్మలరామారం, గుండాల, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు వసతి గృహాల్లోనూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి.

### ఫుడ్ పాయిజన్‌తో నిండు ప్రాణం బలి..

భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో యాజమాన్యం నిర్లక్ష్యంతో ఫుడ్ పాయిజన్‌తో ఓ విద్యార్థి బలయ్యాడు. ఈ నెల 11న విద్యార్థులకు కలుషిత ఆహారం పెట్టగా అది తిన్న విద్యార్థులు సుమారు 40 మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో 25 మంది తీవ్ర అస్వస్థతకు గురికాగా యాజమాన్యం నిర్లక్ష్యంతో గుట్టుచప్పుడు కాకుండా పాఠశాలలోనే వైద్యాధికారుల సాయంతో తల్లిదండ్రులకు చెప్పకుండా రెండు రోజులు చికిత్స చేయించారు. సరైన చికిత్స అందకపోవడంతో 10 మంది పరిస్థితి విషమించింది. వీరిలో ఆరుగురిని భువనగిరి ఏరియా దవాఖానకు, నలుగురిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానాకు తరలించి చికిత్స చేయించారు. కానీ, రెయిన్‌బో దవాఖానలో చికిత్స పొందుతూ సీహెచ్ ప్రశాంత్ అనే విద్యార్థి ఈ నెల 16న మృతి చెందాడు. భువనగిరి ఏరియా దవాఖానలో మరో ఐదుగురు, గురుకుల పాఠశాలలో ఆరుగురికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇందుకు పూర్తి బాధ్యత పాఠశాల యాజమాన్యానిదేనని, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే ఇంతమంది అస్వస్థతకు గురయ్యారని, ఒక విద్యార్థి మృతి చెందడంతో ప్రభుత్వం పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది. ఓ కమిటీని ఏర్పాటు చేసి జరిగిన ఘటనపై నివేదిక అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

### అరకొర వసతులు..

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థులతోపాటు ఇతర విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోతున్నారు. పాఠశాలలో అరకొర వసతులు ఉన్నాయని, రాత్రి వేళ విరేచనాలు అయితే ఇబ్బంది అవుతుందని, మరుగుదొడ్లు దూరంగా ఉన్నాయని చెబుతున్నారు. ఇబ్బందులు కలిగినప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.


భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

### ఎస్ఎఫ్ఐ,బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా..

ఫుడ్ పాయిజన్‌తో ఎంతో మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడడంతోపాటు మంగళవారం మృతి చెందిన ప్రశాంత్ అనే విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బుధవారం హాస్టల్ ముందు ధర్నా నిర్వహించారు. అలాగే బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలోనూ ధర్నా చేపట్టి ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిన సంఘటనగా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టల్, గురుకుల హాస్టల్‌పై నిర్లక్ష్యం చూపిస్తున్న ఆర్‌సీఓ రజినిని వెంటనే సస్పెండ్ చేయాలని, హాస్టల్ విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. గురుకులాల పరిస్థితిపై కలెక్టర్ స్పందించి హాస్టళ్లను తనిఖీ చేయాలని, అలాగే మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రశాంత్ మృతి కలిచివేసింది

– ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

భువనగిరి గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో సీహెచ్ ప్రశాంత్ మృతి కలచివేసిందని, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఎక్స్‌లో స్పందించారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థి ప్రభుత్వ అసమర్థతతో మరణించడం దురదృష్టకరం. కేసీఆర్ పాలనలో ఘనకీర్తి సాధించిన తెలంగాణ గురుకులాలు ఇప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థుల నమ్మకాన్ని కోల్పోతున్నాయి. వరుస ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజన్ సంఘటనతో గురుకులాల ప్రతిష్ట దిగజారుతుంది. ప్రజాపాలన అంటూ ప్రతీకార పాలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురుకులాల్లో చదువుకుంటున్న పేద బిడ్డల సంక్షేమం గురించి కనీస ఆలోచన లేదు. విద్యార్థి ప్రశాంత్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనే. ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నా.

### ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్ : అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నామని, అందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించామని కలెక్టర్ హనుమంతు కె.జెండగే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని ఏరియా ఆస్పత్రి, హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, మిరాకిల్ ఆస్పత్రుల్లో తుర్కపల్లి తాసీల్దార్ దేశ్యా, ఉస్మానియా హాస్పిటల్, బంజారాహిల్స్ రెయిన్‌బో ఆస్పత్రుల్లో పోచంపల్లి తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, భువనగిరి ఏరియా ఆస్పత్రిలో భువనగిరి తాసీల్దార్ అంజిరెడ్డిని పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. చౌటుప్పల్ ఆర్డీఓను రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రశాంత్ కోసం ప్రత్యేకంగా నియమించినట్లు చెప్పారు. ఉస్మానియా హాస్పిటల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, గాంధీ హాస్పిటల్లో డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ యశోద, హరిశంకర్‌ను విద్యార్థుల చికిత్స పర్యవేక్షణ కోసం నియమించామని కలెక్టర్ వివరించారు.

### ఎలర్జీ వచ్చినా పట్టించుకోవట్లేదు



ఫుడ్ పాయిజన్‌తో పిల్లలు ఐదు రోజులుగా వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. మా అబ్బాయి లోకేశ్‌కు ప్రస్తుతం వాంతులు, విరేచనాలు తగ్గి నిలకడగానే ఉన్నప్పటికీ శరీరంపై ఎలర్జీ వచ్చింది. దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రిపూట విరేచనాలు అవుతుండడంతో టాయిలెట్లు దూరంగా ఉన్నందున అక్కడికి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇక్కడ పిల్లలను ఉంచాలంటే భయంగా ఉంది. అందుకే పిల్లాడిని ఇంటికి తీసుకెళ్తున్నాం.

–దేశపాక నవనీత, గోకారం, వలిగొండ మండలం

### మా పిల్లలకు భరోసా ఎవరు?



గురుకుల పాఠశాలలో ఉంచితే మా పిల్లలకు భరోసా ఎవరిస్తారు. కనీసం ఇక్కడ పిల్లలను పట్టించుకునేవారు లేరు. ఎప్పుడు వచ్చి చూసినా తాగడానికి, వండడానికి బోరు నీళ్లే వాడుతున్నారు. మరుగుదొడ్లు దూరంగా ఉన్నాయి. అన్నం మంచిగా పెట్టేవారు కాదు. కూరగాయలు అంతంత మాత్రంగానే ఉండేవి. పిల్లలు తింటున్నారా? లేదా అని అడిగే దిక్కే లేదు.

–లక్ష్మి, చౌటుప్పల్

### యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి



గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పిల్లలకు ఈ పరిస్థితి వచ్చింది. ఫుడ్ పాయిజన్ జరిగిన వెంటనే యాజమాన్యం మాకు చెప్పలేదు. దవాఖానలో చికిత్స చేయించకుండా నిర్లక్ష్యం చేసింది. దాంతోనే విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

–మమత, అనాజిపురం